క్లుప్తంగా

చందంపేట ఎంపీడీఓపై లోకాయుక్తలో ఫిర్యాదు

చందంపేట : జాతీయ ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై చందంపేట ఎంపీడీఓ లక్ష్మిపై మండలంలోని బిల్డింగ్‌తండా గ్రామానికి చెందిన రమావత్ మోహన్ కృష్ణ లోకాయుక్తను ఆశ్రయించాడు. ఈ మేరకు స్పందించి లోకాయుక్త జూలై 30లోగా జాతీయ ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై వివరణ ఇవ్వాల్సిందిగా బుధవారం నోటీసులు జారీ చేసింది.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

గుర్రంపోడు : వానాకాలం 2025లో కొత్తగా భూమి పట్టాలు పొందిన రైతులు రైతు భరోసాకు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి తెలిపారు. ఈ నెల 5వ తేదీలోగా విస్తరణాధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్ ప్రతులు ఏఈఓకు అందించాలన్నారు.

పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో 65వ ర్యాంకు

గుర్రంపోడు : ఉస్మానియా యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పిట్టలగూడెం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు మన్న వేణుగోపాల్‌కు న్యాయ శాస్త్రంలో 65వ ర్యాంకు సాధించాడు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూక్, రామకృష్ణ, వెంకన్న, అతియా అంజుం, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలని వినతి

మిర్యాలగూడ : పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు బుధవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్‌లు మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యా హక్కుల చట్టం నిబంధనలను పాటించడం లేదన్నారు. తమ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్ట్‌లను కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి సురేష్, పరంగి సురేష్, లావూరి రవీందర్‌నాయక్, గాదగోని మహేష్‌గౌడ్, రాజు, నరేష్, సైదానాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దవూర : ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య లభిస్తుందని హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని పోతునూరు, పెద్దవూర గ్రామాలలో అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఏడాది విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి పై తరగతులలో చేరితే ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వర్కాల ఆదిరెడ్డి, శిల్ప, వెంకట్‌నాయక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చేర్పించండి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మూడేళ్లు పైబడిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 3లో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ యాదమ్మ మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికమైన ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎగ్ బిర్యానిని అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమణ, కళావతి, పుష్ప, బాలింతలు పాల్గొన్నారు.

రూ.10లక్షలు పలికిన తలనీలాల సేకరణ వేలం

నిడమనూరు : ప్రముఖ కోటమైసమ్మ ఆలయంలో తలనీలాల సేకరణకు బుధవారం వేలం నిర్వహించగా రూ.10 లక్షలు పలికిందని ఆలయ ఈఓ ఎస్ నవీన్ తెలిపారు. తలనీలాలు 19 జూన్ 2025 నుంచి 18 జూన్2026 వరకు ఆలయ ప్రాంగణంలో సేకరించవచ్చు. ఇటీవల పోగు చేసిన తలనీలాలకు కేజీకి రూ.7200 పలికింది. వేలం, ఓపెన్ వేలం తోపాటు, సీల్డు టెండరు విధానంలో వేలం నిర్వహించారు. ఓపెన్ విధానంలో రూ.7.77లక్షలు పలకగా సీల్డు టెండరు విధానంలో 10లక్షలు పలికింది. ఓపెన్ విధానం, సీల్డు టెండరు విధానంలో ఏది ఎక్కువగా ఉంటే వారికే వార్షిక తలనీలాల హక్కులు లభిస్తాయి. సీల్డు టెండరు విధానంలో రూ.10లక్షలు పలికిన దాసరి రామకృష్ణకు దక్కింది. 12 మంది బహిరంగ వేలంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చెవిటి ఆంజనేయులు, ఈఓ నవీన్, ఆలయ సిబ్బంది విశాల్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాలపై నిర్లక్ష్యం!

- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- నిర్వహణ మరిచిన అధికారులు

అడవిదేవులపల్లి : అధికారుల నిర్లక్ష్యంతో సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. జిల్లాలోనే అత్యంత సమస్యాత్మక గ్రామాలైన అడవిదేవులపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. అడవిదేవులపల్లిలో ముందు చూపుతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎందుకు పనికి రాకుండా పోవడంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. మండలంలో 13 గ్రామ పంచాయతీలు అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల, అడవిదేవులపల్లి, బంగారుకుంటతండా జిలకరకుంట తండ, బాల్నేపల్లిలతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు, మూడు గ్రామ పంచాయతీల్లో మాత్రమే పని చేస్తున్నాయి. ఈ కెమెరాలు కేవలం ఏడాది పాటు పనిచేశాయి. గతంలో గ్రామ పంచాయతీ వారే నిర్వహణ బాధ్యత చూసుకున్నారు. ప్రజా ప్రతినిధుల పదవి ముగియడంతో వీటి నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. 2023లో తెలంగాణ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఆధ్వర్యంలో 13 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధుల ద్వారా సుమారు ఒక్కోక్క గ్రామ పంచాయతీల్లో రూ.40వేల వ్యయంతో అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా ప్రతి గ్రామ పంచాయితీలో మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సీసీ కెమరాలు సరిగా పని చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.



అడవిదేవులపల్లి మండల కేంద్రంలో పనిచేయని సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలతో ఎంతో మేలు

సమస్యాత్మక గ్రామాలైన అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం, కొత్తనందికొండ, బంగారుకుంటతండా, బాల్నేపల్లి,, చిట్యాల గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేవారు. గ్రామ పంచాయతీ పాలక మండల పూర్తయిన తరువాత వీటి నిర్వహణను ఎవరూ పట్టించుకోలేదు. పోలీస్ ఉన్నతాధికారులు ఉమ్మడి మండలంగా ఉన్నప్పుడే వాడపల్లి పోలీస్ స్టేషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ప్రధాన వ్యాపార సంస్థల్లో ఉంటే ఎంతో మేలు కలుగుతుందని వ్యాపార వర్గాలు విరాళాలు ఇవ్వడంతో పాటు సహకారాలను అందజేశారు. పట్టించుకోకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈ సీసీ కెమెరాలు ఉంటే ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వినియోగంలోకి తీసుకురావాలి



మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలి, వీటి వలన ప్రధాన కూడల్లో నిర్వహించే పలు విషయాలు సీసీ కెమెరాలను గుర్తించవచ్చు అదే విధంగా దొంగతనాలు, కొత్త వ్యక్తుల కదలికలు కూడా పూర్తి స్థాయిలో కనబడతాయి. సీసీ కెమెరాలు పనిచేసేలా అధికారులు ప్రత్యేక చర్యలను తీసుకోవాలి. దొంగతనాలు సైతం జరగవు. అక్రమ వ్యాపారులు సైతం, నిలువరించబడుతాయి.

– కరెంటోతు రవి, బంగారుకుంటతండా, అడవిదేవులపల్లి

డ్రైయినేజీ, నీటి సరఫరా పనులు పూర్తిచేయాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణాలను, నీటి సరఫరా పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశంలో అమృత్ పథకం ద్వారా పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని డ్రెయినేజీల్లో చెత్త పేరుకపోయి అధ్వానంగా తయారవుతున్నాయని, వాటి పరిశుభ్రతకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దన్నారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, వేగం, నాణ్యత ఉండాలన్నారు. అవసరమైతే మానిటరింగ్ మెకానిజాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న డీఈఓ భిక్షపతి, చిత్రంలో ఉపాధ్యాయులు

దేవరకొండ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల నమోదు, ఉపాధ్యాయుల పనితీరు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు టీచింగ్ డైరీ మెయింటెన్ చేయాలన్నారు. అనంతరం పాఠశాలలో కొత్తగా నమోదైన విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బక్కయ్య, శ్రీపతిరావు, లోక్యానాయక్, అబిద్‌అలీ, పండరినాథ్, వినయ్‌కుమార్, గణేష్ తదితరులున్నారు.

జలవనరుల సంరక్షణతోనే మనుగడ

నిడమనూరు : భూగర్భ జలవనరుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, కేంద్ర జల సంఘం అధికారి సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలో మండలంలోని ముకుందాపురం, నారమ్మగూడెం, రేగులగడ్డ, తుమ్మడం, వల్లభాపురం, నిడమనూరు, వేంపాడు, మారుపాక, వెనిగండ్ల, ఊట్కూర్,ముప్పారం, గుంటిపల్లి, బంకాపురం గ్రామాల్లో ఉపాధిహామీలో చేపట్టిన నీటి గుంతలను పరిశీలించారు. ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.3,298 మెటీరియల్ కంపోనెంట్, రూ.898 లు ఉపాధి కూలీల వేతనం కింద లబ్ధిదారుడి ఖాతాలో జమచేస్తారు. వాన నీటి సంరక్షణ చర్యలతో భూగర్భ జల వనరులు పెంపొందించుకోవాలని సూచించారు. ఇంకుడుగుంతల నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఏపీవో శ్రీనివాస్, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు సైదులు, వెంకటరత్నం, శ్రీనివాస్, నరసింహరావు, సత్యవాణి, సైదులు, వెంకటరత్నం, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



నీటి గుంతలను పరిశీలిస్తున్న జలసంఘం అధికారి సంతోష్ కుమార్, ఉద్యోగులు

విధుల్లోకి తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికురాలి నిరసన



మున్సిపల్ ఆఫీస్ ద్వారం వద్ద కింద పడుకొని నిరసన తెలుపుతున్న కార్మికురాలు, కుమారుడు

మిర్యాలగూడ టౌన్ : తనను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పారిశుద్ధ్య కార్మికురాలు రామాంజి జ్యోతి, తన కుమారుడు సందీప్‌తో కలిసి బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తాను ఏ తప్పు చేయకున్న విధుల్లో నుంచి తొలగించారన్నారు. ఆమెకు ఎమ్మార్పీఎస్, ఎంసీపీఐ(యూ) నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) నేత వస్కుల మట్టయ్య మట్లాడుతూ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన రామాంజి జ్యోతి మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తుందని, ఇటీవల కాలంలో గ్రామంలోని పొలం విషయంలో ఇతరులతో వాగ్వాదం కాగా పోలీస్ స్టేషన్లలో కేసు నమోదైంది. దీంతో ఆమెను మున్సిపాలిటీ విధుల్లో నుంచి తీసివేశారని, భూమి కేసు, పారిశుద్ధ్య కార్మికురాలకి ఏమి సంబంధం అని ప్రశ్నించారు. ఆమె కేసు వాపస్ తీసుకోవాలని, లేకుంటే విధుల్లోకి రావొద్దాని ఒత్తిడి తెస్తున్నారన్నారు. పలుమార్లు డ్యూటీలోకి తీసుకోవాలని జ్యోతి అధికారులు, ప్రజాప్రతినిధుల కాళ్లు మొక్కిన కూడా ఎవరూ కనికరించలేదన్నారు. ఈ మున్సిపాలిటీలో చాల వరకు అక్రమాలు జరుగుతున్నాయని,అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌ను అడడగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణకు చెప్పి సమావేశం ఉందంటూ వెళ్లిపోయాడు. ఈనెల 19న మాట్లాడుదామని ఇన్‌స్పెక్టర్ చెప్పినట్లు సమాచారం . ఈ కార్యక్రమంలో వస్కుల భరత్, కిరణ్,ఇమ్మానియేలు తదితరులున్నారు.

భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

దేవరకొండ : భూ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.బుధవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏకేబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూ నిర్వాసితులు, పెండ్లిపాకల ఓపెన్ కెనాల్ భూ నిర్వాసితులకు ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహారం చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఆయా ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. గుడిపల్లి మండలం చిలకమర్రి గ్రామానికి చెందిన 12మంది భూ నిర్వాసితులకు రూ.68లక్షల విలువ గల నష్టపరిహారం చెక్కులు, పీఏపల్లి మండలం బాలాజీనగర్‌కు చెందిన 45మంది భూములు కోల్పోయిన రైతులకు రూ.11.06 కోట్ల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పదేళ్లుగా ఏకేబీఆర్, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు పనిగట్టుకొని ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇంకా పరిహారం అందని వారికి కూడా త్వరలోనే పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాయిని జమునారెడ్డి, ఆర్డీఓ రమణారెడ్డి, ఎంఏ సిరాజ్ ఖాన్, ఆలంపల్లి నర్సింహ, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, ఈఈ నెహ్రూనాయక్, డీఈ నాగయ్య, ఏఈలు, ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు, తదితరులున్నారు.



దేవరకొండ : భూ నిర్వాసితులకు పరిహారం చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పేదలకు ఇందిరమ్మ ఇల్లు వరం

చందంపేట : ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు వరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం చందంపేట మండల కేంద్రంలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి ఇల్లు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. అంతకుముందు పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జర్పుల బద్యా నాయక్, లోకసాని కృష్ణయ్య, వెంకటయ్యగౌడ్, సర్వయ్య, గోవిందుయాదవ్, మల్లారెడ్డి, అనంతగిరి, రంగయ్యగౌడ్, నోముల మల్లయ్య, వరికుప్పల కొండల్, తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఆర్ఐ, తదితరులు పాల్గొన్నారు.



కొల్‌ముంతలపహాడ్‌లో కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

ప్రభుత్వ బడుల బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం

కొండమల్లేపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ ధ్యేయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని కొల్‌ముంతలపహాడ్ రైతు వేదిక సమీపంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన కేజీబీవలో వసతుల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, నాయకులు సిరాజ్ ఖాన్, పీఏసీఎస్‌చైర్మన్ వేణుధర్‌రెడ్డి, రేఖ శ్రీధర్ రెడ్డి, నర్సింహా, వేమన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, యుగంధర్‌రెడ్డి, డీఈ శైలజ, ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, ఏఈ లష్కర్, ప్రిన్సిపాల్ సరళ, రాంసింగ్, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

మిర్యాలగూడ టౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నేత సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మిర్యాలగూడ టూ టౌన్ పరిధిలో భారత ప్రధాని నరేంద్రమోదీ 11ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆపార్టీ టూటౌన్ శాఖ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ టూ టౌన్ అధ్యక్షుడు పెద్దబోయిన వెంకటరమణ, ప్రధాన కార్యదర్శులుబు బాషపాక శంకర్, గుండ్లపల్లి శ్రీకాంత్, నిరంజన్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత, భాగ్యలక్ష్మి, రేణుక, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, సైదులు, రమేష్, సోమలింగం, తదితరులున్నారు.

నాగార్జునసాగర్ : కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొమ్ము రామదాసు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గణేష్ తంగరాజులు అన్నారు. నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్‌లో 11ఏళ్ల బీజేపీ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై అమృత్ కాల వికసిత్ భారత్ సంకల్ప సభ పెద్దవూర మండల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, కేఎస్ సుమ, రమణ, పద్మారెడ్డి, విక్రమ్, రమణమ్మ పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నేత మల్లు గౌతంరెడ్డి కోరారు. బుధవారం మిర్యాలగూడ డిపో వద్ద రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్, పగిళ్ల కృష్ణయ్య, రాములు, బాలయ్య, రామచంద్రయ్య, ఎస్ఎం రెడ్డిలతో పాటు పలువురు నాయకులు తదితరులున్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

మాడుగులపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం తహసీల్దార్ సురేష్ లబ్ధిదారులకు అందజేశారు. ఇందుగుల, దాచారం , మాడుగులపల్లి, చెరువుపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఆ చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ , ఆర్ఐ రేణుక, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున, నాగయ్య తదితరులు ఉన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి



చింతపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి

చింతపల్లి : మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం బాటలు వేస్తుందని డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి అన్నారు .మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహిళా సంఘాల లీడర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నిరుపేద మహిళ సంఘంలో ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు చాలా పెద్దపీట వేస్తుందని, మహిళలు సైతం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ కోసం ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు ప్రతి ఒక్కరు విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు. మహిళా వికలాంగులకు వ్యాపారం చేసుకోవడానికి రెడ్డీస్ ల్యాబ్స్ సంస్థ రూ.25వేల వరకు పెట్టుబడి అందిస్తుందని తెలిపారు. వ్యాపారం చేయాలని అభిలాష కలిగిన సంఘాల సభ్యులు ఈనెల 20న దేవరకొండలో నిర్వహించనున్న సమావేశానిక హాజరుకావాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎం విజయలక్ష్మి, సీఆర్పీలు గుండ్లపల్లి పూలమ్మ, ఏ. వజ్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం

దేవరకొండ : ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందవచ్చని దేవరకొండ నియోజకవర్గ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి రవినాయక్ అన్నారు.బుధవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో మాధవరం జనార్దన్ రావు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరే ఇతర పంటకు లేని విధంగా ఆయిల్‌పామ్ దిగుబడులను మార్కెట్‌తో సంబంధం లేకుండా కంపెనీల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయిస్తుందన్నారు. ఒక ఎకరం వరి సాగు నీటితో మూడెకరాల ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్ సౌకర్యం, మొక్కలకు రాయితీ సౌకర్యాలను వినియోగించుకొని రైతులు పెద్ద ఎత్తున పంట సాగు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, శేఖర్, ప్రకాష్, ఇంద్రకుమార్, కృష్ణయ్య, రవి, విష్ణుభార్గవ్, తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న రవినాయక్, రైతులు

యోగాతో ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థినులు

మిర్యాలగూడ టౌన్ : నిత్యం యోగా చేయడంతో శారీరక, మానసిక ఆరోగ్యంగా ఉంటుందని నిడమనూరు పీహెచ్‌సీ యోగా శిక్షకురాలు గంధం శైలజ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం అవంతిపురంలో గల గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం యోగాతో కలిగే ప్రయోజనాలను విద్యార్థినులకు ఆమె వివరించారు. ఈ సందర్భంగా గంధం శైలజ మాట్లాడుతూ ఈ యోగా ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను కూడా నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరిత, నాగరాణి, శుక్రి, సునిత, శ్రవంతి, నాగసుధా తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆటో సదుపాయాన్ని కల్పిస్తున్న ఎంఈఓ

పెద్దవూర : విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు అభ్యసించాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. బుధవారం మండలంలోని తెప్పలమడుగు, లింగంపల్లి, ఈదులగూడెం గ్రామాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు విద్యార్థులకు రావడానికి గల సమస్యలపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు తల్లిదండ్రులు చెప్పడంతో వెంటనే ఆటోను మాట్లాడి నెలకు రూ.4వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకుని ఆటోను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జతిన్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానంతో మరొకరికి చూపు

మిర్యాలగూడ అర్బన్ : నేత్ర దానంతో మరొకరికి చూపు వస్తుందని వాసవి క్లబ్ ఐపీసీ మిట్టపల్లి విజయబాస్కర్‌రావు అన్నారు. బుధవారం ప్రముఖ వ్యాపారవేత్త మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ కార్యదర్శి సాంబశివ రైస్ ఇండస్ట్రీ మేనేజింగ్ పాట్నర్ రంగా లింగయ్య మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని యన కుటుంబ సభ్యులతో మాట్లాడి రంగా లింగయ్య నేత్రాలను సేకరించి డైమాండ్ నేత్ర నిధికి అందించగా ఆ నేత్రాలను హైదరాబాద్‌లోని అగర్వాల్ ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రావు మాట్లాడారు. అనంతరం నేత్రదాన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేత్రనిధి టెక్నిషియన్ బచ్చలకూర రమేష్, పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు నేత్రదాన అంగీకార పత్రాలను అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

హాలియా : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలలో ప్రధానమైన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 2500, ఆసరా పెన్షన్ రూ. 4వేలకు పెంచడం, రేషన్ కార్డులు వంటి పథకాలను అందించకపోడం దారుణమన్నారు. తక్షణమే ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, అక్రమ సంపాదనాన్ని వెలికి తీసి ప్రతి కుటుంబానికి రూ. 15లక్షలు ఇస్తానని మాయ మాటలతో మూడోసారి అందల మెక్కడాన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రైవేట్ పరం చేస్తూ కార్మిక చట్టాల సవరణతో కార్మికుల శ్రమను దోచి కార్పోరేట్ సంస్థలకు పంచి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాలియాలో 48 సర్వే నంబర్‌లో పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్రామసభల ద్వారా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారి ఐలయ్య, చినపాక లక్ష్మీనారాయణ, కొండేటి శ్రీను, అవుతా సైదులు, దైద శ్రీను, రవినాయక్ తదితరులు ఉన్నారు.